T/AP/2025/1017/2082/1372

# ది ఎవిడెన్స్

THE EVIDENCE

డిజిటల్ తెలుగు దినపత్రిక

తేది : 17-4-2026 శుక్రవారం సంపుటి : 1 సంచిక : 101 ఎడిటర్ : జి.శ్రీనివాసరావు విశాఖపట్నం పేజీలు : 4 వెల : రూ.1/-

### పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్‌ఎమ్‌సీలకు అప్పగించండి : మంత్రి నారా లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్‌ఎమ్‌సీలకు అప్పగించాలని అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను 3 స్టార్‌కు చేర్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం (మిగతా 2వ పేజీలో)

### ఏపీలో భగ్గుమన్న సూరీడు

**నంద్యాలలో 45.1 డిగ్రీలు.. రేపు మరింత తీవ్రత!**

అమరావతి, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. గురువారం నాడు రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నంద్యాల జిల్లా సంజామలలో అత్యధికంగా 45.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవగా, కడప జిల్లా ఒంటిమిట్టలో 44.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. రాష్ట్రంలో ఎండల తీవ్రతకు ఇది అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో, రాబోయే 24 గంటల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. శుక్రవారం (ఏప్రిల్ 17) కూడా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు (మిగతా 2వ పేజీలో)

# బడ్జెట్ హామీలు నెరవేర్చాల్సిందే

## కేంద్ర పథకాల ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయాలి: సీఎం



అమరావతి, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : బడ్జెట్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధుల కొరత అడ్డంకి కాకూడదని ఆర్థిక శాఖకు స్పష్టం చేశారు. నిధుల కొరత ఉన్నప్పటికీ ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా హామీలు అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుంచి నిధుల రూపంలో అందే సహకారాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని.. పీపీపీ విధానంలో చేయదగిన ప్రాజెక్టులను గుర్తించాలని సూచించారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా సూక్ష్మ, స్థూల ప్రణాళికలు అమలు చేయాలని.. పూర్తిస్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. 15 శాతం వృద్ధిరేటు లక్ష్యాన్ని అందుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికలను సమర్థంగా అమలు చేయాలన్నారు. నీరు, విద్యుత్ లాంటి వనరులను వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేర అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులున్నా విద్యుత్ చార్జీలు పెంచలేదని.. గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4,600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని గుర్తుచేశారు. ప్రజలపై భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయన్నారు.

**సింగపూర్ పాలనా సంస్కరణలను అధ్యయనం చేయండి మంత్రులకు సీఎం దిశానిర్దేశం**

'సింగపూర్ చిన్న దేశమైనా బ్రహ్మాండమైన అభివృద్ధిని సాధించింది.. అక్కడ ఒకే ప్రభుత్వం అధికారంలో ఉండడం.. అవినీతి రహితంగా ఉండడం, పాలనా సంస్కరణలు, అపారమైన మేధోశక్తి ఈ రోజు ఆ దేశాన్ని ప్రపంచంలోనే ఉన్నతస్థానంలో నిలబెట్టాయి' అని ముఖ్యమంత్రి (మిగతా 2వ పేజీలో)

# ఏ రాష్ట్రానికీ సీట్ల శాతం తగ్గదు!

## 104 మంది గైర్హాజరు.. తేలిగ్గా నెగ్గిన సర్కారు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే మహిళా ప్రపంచం క్షమించదని ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలను హెచ్చరించారు. లోక్‌సభ సీట్లను పెంచడం వల్ల రాష్ట్రాలకు ప్రస్తుతం లభించే సీట్ల శాతంలో ఎలాంటి మార్పు ఉండదని ప్రధాని హామీ ఇచ్చారు. అన్ని రాష్ట్రాలకూ లోక్‌సభలో 50 శాతం సీట్లు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలకు గతంలో కంటే ఎక్కువ శాతం సీట్లు లభిస్తాయని కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు 25 నుంచి 38కి, తెలంగాణకు 17 నుంచి 26కు పెరుగుతున్నాయని సభాముఖంగా వెల్లడించారు. లోక్‌సభలో గురువారం చరిత్రాత్మకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా ఈ బిల్లులపై ప్రతిపక్షాల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు ప్రయత్నించారు. దాదాపు 12 గంటల పాటు ఈ బిల్లులపై చర్చ జరిగిన తర్వాత శుక్రవారం సాయంత్రం 4 గంటలకు కీలకమైన ఓటింగ్ జరుగుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. గురువారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ బిల్లులను ప్రవేశపెట్టిన తర్వాత మోదీ, అమిత్‌షాలతో పాటు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీలు ప్రియాంకాగాంధీ, కేసీ వేణుగోపాల్, గౌరవ్ గొగోయ్, డీఎంకే నేత ఎ.రాజా, తెలుగుదేశం ఎంపీ బైరెడ్డి శబరి, శివసేన (యూబీటీ) నేత, బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ప్రసంగించారు.

**మహిళలు గమనిస్తున్నారు**

మహిళా బిల్లును తిప్పిగొట్టేందుకు ప్రతిపక్షాలు దురుద్దేశ పూరితంగా వ్యవహరిస్తే మహిళలు గమనిస్తున్నారన్న విషయం మరిచిపోరాదని ప్రధాని మోదీ హెచ్చరించారు. డీలిమిటేషన్‌ను ఉత్తర దక్షిణ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడానికి ఉపయోగించుకోవడం సరైనది కాదని అన్నారు. లోక్‌సభలో సీట్ల పెంపు తర్వాత అన్ని రాష్ట్రాలకు లభించే సీట్ల శాతంలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం (మిగతా 2వ పేజీలో)

### రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

# పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

**అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**



విశాఖపట్టణం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, కార్యక్రమాలను సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17, 18వ తేదీల్లో విశాఖపట్టణంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పర్యటన ఉన్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సమీక్షించారు. అధికారులందరూ సమన్వయం చేసుకోవాలని, ఎక్కడా ఎలాంటి లోపాలు తలెత్తకుండా, అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 17వ తేదీ రాత్రికి ఆయన విశాఖపట్టణం చేరుకొని, (మిగతా 2వ పేజీలో)

# హస్తినలో కూటమి మహిళల సందడి

**నేడు కూడా పార్లమెంటుకు వెళ్లనున్న మహిళా నేతలు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంటులో గురువారం కేంద్రం బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఢిల్లీలో కూటమి మహిళా నేతలు సందడి చేశారు. గ్యాలరీలో కూర్చుని ఉదయం నుంచి సాయంత్రం వరకు లోక్‌సభలో జరిగిన చర్చను ప్రత్యక్షంగా తిలకించారు. ప్రధాని మోదీ, అమిత్‌షా, బైరెడ్డి శబరి తదితరుల ప్రసంగాలను ఆలకించారు. వీరిలో రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎస్.సవిత, మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, మండలిలో చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, శాసనసభలో విప్‌లు మాధవి, తంగిరాల సౌమ్య, జగదీశ్వరి, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, ఎమ్మెల్యేలు శ్రావణి, విజయశ్రీ, భూమా అఖిలప్రియ, లోకం నాగమాధవి, పరిటాల సునీత, మిరియాల శిరీషాదేవి, (మిగతా 2వ పేజీలో)

### ఏపీలో మున్సిపల్

# కమిషనర్ల బదిలీలు

అమరావతి, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలు, నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. విజయవాడ జోనల్ కమిషనర్ రమ్య కీర్తన -- నరసరావుపేట మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ వినుకొండ మేనేజర్ అర్జునరావు -- దర్శి మున్సిపల్ కమిషనర్‌గా నియామకం పులివెందుల ఇన్‌ఛార్జ్ కమిషనర్ మునికుమార్ -- రెగ్యులర్ కమిషనర్‌గా పదోన్నతి, విజయవాడ నుంచి సుభాష్ చంద్రబోస్ -- వుయ్యూరు మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్, వుయ్యూరు కమిషనర్ జె.రామారావు -- తెనాలి అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ విశాఖ జీఎంసీ దక్షిణ జోన్‌కు పీవీవీడీ ప్రసాద్ రావు -- జోనల్ కమిషనర్‌గా నియామకం, మల్లయ్య నాయుడు -- గుంటూరు కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా బదిలీ, గుంటూరు అదనపు కమిషనర్ ఒబులేసు -- కర్నూలు కమిషనర్‌గా నియామకం, కర్నూలు కమిషనర్ విశ్వనాథ్ -- తదుపరి పోస్టింగ్ కోసం సిడిఎంఎ, రాయపూడిలో రిపోర్ట్ చేయాలనీ ఆదేశం, తిరుపతి రెవెన్యూ అధికారులు లోకేశ్వర వర్మ, చిట్టిబాబు -- యూఏడీఏల్లో కీలక పోస్టింగ్స్, గుంటూరు, కర్నూలు సానిటరీ ఇన్స్పెక్టర్లకు ప్రమోషన్లు, కొత్త బాధ్యతలు, పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాస్ నియామకం, పుట్టపర్తి కమిషనర్ (మిగతా 2వ పేజీలో)

### విశాఖ ఘటన... యువతి ఆత్మహత్య కేసులో

# ఆరుగురు అరెస్ట్





**విశాఖ లాడ్జిలో యువతి ఆత్మహత్య**

**పుట్టినరోజు వేడుకలో స్నేహితుల మధ్య ఘర్షణ**

**దాడి చేయడంతో మనస్తాపానికి గురై బలవన్మరణం**

**ఘటనకు సంబంధించి ఆరుగురు స్నేహితుల అరెస్ట్**

**ఆత్మహత్యకు ప్రేరేపించారనే కోణంలో దర్యాప్తు**

విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : విశాఖపట్నం నగరంలో తీవ్ర కలకలం రేపిన ఘటనలో, స్నేహితులు తనపై దాడి చేశారన్న అవమానభారంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. పుట్టినరోజు వేడుకలో జరిగిన ఈ ఘోరానికి సంబంధించి ఆరుగురు స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జోడుగుళ్లపాలెంకు చెందిన శాంతికుమారి (27) తన స్నేహితులతో కలిసి ఏప్రిల్ 14న రాత్రి విశాలాక్షినగర్‌లోని ఓ లాడ్జిలో పుట్టినరోజు వేడుకలు జరుపుకుంది. ఈ పార్టీలో అందరూ మద్యం సేవించారు. ఈ క్రమంలో, తన గురించి శాంతికుమారి తప్పుడు ప్రచారం చేస్తోందని సాయికిరణ్ అనే స్నేహితుడు ఆరోపించడంతో వారి మధ్య గొడవ మొదలైంది. మాటామాటా పెరగడంతో ఆగ్రహానికి లోనైన సాయికిరణ్, యశ్వంత్, లక్ష్మీ సౌజన్య కలిసి శాంతికుమారిపై దాడి చేశారు. స్నేహితుల దాడితో తీవ్ర మనస్తాపానికి గురైన శాంతికుమారి, లాడ్జిలోని మరో గదిలోకి వెళ్లి (మిగతా 2వ పేజీలో)

### పునర్విభజన బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు

# అన్యాయం జరగదు

## ఎంపీ పురందేశ్వరి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన (ణవశ్రీఱఎఱ్ఞఱశీఅ దీఱశ్రీశ్రీ 2026), 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో రాజమహేంద్రవరం బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు.

**ఎన్టీఆర్ వారసత్వాన్ని స్మరిస్తూ..**

ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (చీ=) మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు (మిగతా 2వ పేజీలో)

# కూటమి ప్రభుత్వం యువత భవిష్యత్తుతో అటలాడుతోంది

### వై.యస్.ఆర్.సి.పి విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె రాజు

విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నాడు జిల్లా యువజన విభాగ అధ్యక్షులు ఉరుకూటి రామచంద్ర రావు, రాష్ట్ర విద్యార్థి కార్యనిర్వాహక అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీవాత్సవ్ ఆధ్వర్యంలో యువజన విభాగం మరియు విద్యార్థి విభాగం ముఖ్య నాయుకులు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశాఖపట్నం జిల్లా పార్టీ అధ్యక్షులు కె.కె రాజు ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరి తీవ్ర నిరాశను కలిగిస్తోందన్నారు. ఉద్యోగాల పేరుతో హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో విఫలమవడం వల్ల లక్షలాది మంది యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని, ఎన్నికల సమయంలో భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినప్పటికీ, ఆ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయన్నారు. నోటిఫికేషన్ల ఆలస్యమవడం, ఇప్పటికే విడుదలైన పోస్టులన్ని యువతలో తీవ్ర అసంతృప్తి కలిగిస్తున్నాయని, యువత నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామని చెప్పిన స్కిల్ ప్రోగ్రామ్‌లు కూడా సరైన ఫలితాలు ఇవ్వలేకపోయాయన్నారు. పరిశ్రమలు రాకపోవడం, ఉన్న అవకాశాలు కూడా తగ్గిపోవడం వల్ల యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని హామీలు ఇచ్చినా, వాటిని అమలు చేయడంలో విఫలమయ్యిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో ఆలస్యం, స్కాలర్‌షిప్‌లు సమయానికి అందకపోవడం, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కొరత ఇవన్ని విద్యార్థులపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ప్రభుత్వ



విధానాలు విద్యార్థులకు అనుకూలంగా లేకపోవడం వల్ల వారి ఆశలు, లక్ష్యాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లను సమయానికి అందించి, విద్యా రంగంలో స్థిరత్వాన్ని తీసుకురావాలని అన్నారు. ఈ సమావేశంలో యువజన విభాగం జోనల్ అధ్యక్షులు అంబటి శైలష్, యువజన విభాగం మరియు విద్యార్థి విభాగం నాయుకులు జగ్గుపల్లి నరేష్ , దీరాజ్ రెడ్డి , హరీష్ , చంద్రమౌలి , నాగిరెడ్డి కిరణ్ , తాడి రవి తేజ , రవికిరణ్ రెడ్డి , తులసి కుమార్ , రోహిత్, నితిష్, రౌత్ శ్రీను, మీసాల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



విశాఖపట్నం, విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : విశాఖపట్నం,జోన్–1 విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ వినాయక టెంపుల్ మరియు 11 కెవి తాటిచెట్లపాలెం ఫీడర్స్ పైన హెచ్.టి. లైన్స్ మెయింటెన్స్ చేయడం వలన రెడ్డి తాటిచెట్లపాలెం,, తాటిచెట్లపాలెం బజార్ రోడ్, శివాలయం వీధి, సంతోష్ మాత టెంపుల్ ప్రాంతం, నాగేశ్వరరావు గ్యాస్ గొడౌన్‌ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కనుక ప్రజలు సహకరించాలని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తెలిపారు.

# జనగణనకు సహకరించాలి: గంటా

విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : జనగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం అందజేసి సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రజల గురించి సంపూర్ణ సమాచారముంటేనే ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం సులభతరమవుతుందని చెప్పారు. స్వీయ గణనలో మొబైల్ ద్వారా 33 ప్రశ్నలకు సమాధానమిచ్చాక కేటాయించే 11 నెంబర్ల ఐడీని మే 1 వ తేదీ నుంచి జనగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు తెలియజేస్తే... యాప్ లో సరి చూస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు తగిన సమాచారమిచ్చి సహకారం అందించాలని.. వివరాలిస్తే పథకాలు ఆగిపోతాయన్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో 1.10 లక్షల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్న జనగణన విజయవంతానికి.. ప్రజాప్రతినిధులతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం శక్తి సంఘాలు దన్నుగా నిలవాలని కోరారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రపంచంలో అతి పెద్ద గణాంక కార్యక్రమంగా అభివర్ణించారు. అంతకుముందు రూ. 37.55 లక్షలతో భీమిలి జోన్ లోని 4 వార్డుల్లో ప్రతిపాదించిన డ్రెయిన్ల పూడికతీత పనులకు, రూ. 8.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న చలివేంద్రాలకు



గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. జోనల్ కమిషనర్ ఎం..విజయ్ కుమార్, భీమిలి ఎమ్మార్వో పి. రామారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, గొలగాని నరేంద్ర, సరగడ అప్పారావు, కనకల అప్పలనాయుడు, కొప్పుల రమేష్, దండి వెంకటేష్ భువనేశ్వరి, కొప్పుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ హామీలు నెరవేర్చాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ నెల 21 నుంచి 27 వరకు 9 మంది మంత్రుల బృందం సింగపూర్‌లో పర్యటించనున్న నేపథ్యంలో గురువారం సచివాలయంలో ఆయన వారితో ప్రత్యేకంగా సమావేశమ య్యారు. వైసీపీ హయాంలో సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో భాగంగా వెళ్తున్న మీరంతా.. అక్కడి పాలనా సంస్కరణలు, పాలనలో వేగం, పారదర్శకతను పెంచేందుకు అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని వారికి దిశానిర్దేశం చేశారు. '2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే ఈ రోజు రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్లేది. జగన్ రావడంతో ఆర్థిక విధ్వంసంతోపాటు పారిశ్రామికవేత్తలు పారిపోయారు. ఇలాంటి అభివృద్ధి నిరోధకుడితో రాష్ట్ర విభజన కంటే ఎక్కువ నష్టం జరిగింది' అని ధ్వజమెత్తారు. జగన్ నిర్వాకంతో సింగపూర్ ప్రభుత్వం మనతో మాట్లాడేందుకు కూడా ఇష్టపడలేదన్నారు. ఏపీకి రావలసిన సింగపూర్ కంపెనీలు మలేసియాలో టౌన్‌షిపలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని, పి.నారాయణ, నిమ్మల, బీసీ జనార్దన్‌రెడ్డి, సత్యకుమార్ పాల్గొన్నారు.

## హస్తినలో కూటమి మహిళల సందడి

(మొదటి పేజీ తరువాయి)

సత్యప్రభ, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు సావిత్రి, పీతల సుజాత, ఉండవల్లి శ్రీదేవి, రాయపాటి శైలజ, తేజస్వి, స్వప్న, కమ్మరి పార్వతి, మన్నూరు సుగుణమ్మ, పాలవలస యశస్వి, కతారి హేమలత తదితరులు ఉన్నారు. మహిళా రిజర్వేషన్లకు మద్దతుగా భారీగా కూటమి నేతలు తరలిరావడం చూసి పలు పార్టీల ఎంపీలు ఆశ్చర్యపోయారు. మహిళానేతలు, కూటమి ఎంపీలతో పార్లమెంటు ప్రాంగణమంతా సందడిగా మారింది. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌తో కూటమి మహిళా నేతలు సమావేశమయ్యారు. నేడు కూడా వారు పార్లమెంటుకు హాజరవుతారు.

## విశాఖ ఘటన... యువతి ఆత్మహత్య కేసులో

(మొదటి పేజీ తరువాయి)

తలుపు వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన స్నేహితులు తలుపులు పగలగొట్టి చూడగా, ఆమె ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న శాంతికుమారి తల్లి రమ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విశాఖ వెస్ట్ ఏసీపీ నరసింహమూర్తి మాట్లాడుతూ, నిందితులు దాడి చేసిన మాట వాస్తవమేనని, అయితే స్నేహితులు కొట్టారన్న బాధతోనే ఆమె ఆత్మహత్య చేసుకుందా లేక దాడి కారణంగా మరణించిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నట్లు చెప్పారు. నిందితులైన ఆరుగురిని అరెస్ట్ చేసి, ఆత్మహత్యకు ప్రేరేపించడం (అబెట్‌మెంట్ టు సూసైడ్) సెక్షన్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ ఘటన నగరంలో చర్చనీయాంశంగా మారింది.

## రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

(మొదటి పేజీ తరువాయి)

18వ తేదీ ఉదయం నుంచి విశాఖపట్టణంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆ మేరకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పర్యటనలో భాగంగా ఎండాడ పరిధి రుషికొండ ఇస్కాన్ టెంపుల్ వెనుక భాగంలో నిర్మించతలపెట్టిన జ్యూడీషియల్ గెస్ట్ హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన ఆయన చేతుల మీదుగా జరుగుతుందని, దీని నిర్వహణలో జిల్లా అధికారులు, న్యాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ప్రోటోకాల్, భద్రత, బందోబస్తు, ట్రాఫిక్ మేనేజ్మెంట్, వసతి ఇతర ఏర్పాట్లలో లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఫస్ట్ ఏడీజే ఎం. వెంకట రమణ, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

(మొదటి పేజీ తరువాయి)

కాంతి కుమార్ -- హిందూపురం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ, అదోని రెవెన్యూ ఆఫీసర్ బేబీ -- ఆత్మకూరు (కె) కమిషనర్‌గా పోస్టింగ్అలాగే, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పలువురు అధికారులకు కూడా కీలక నియామకాలు కల్పించారు. ఈ మొత్తం బదిలీలు, నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## పునర్విభజన బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ...

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారని సభకు వివరించారు.

**దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై స్పష్టత**

నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని పురందేశ్వరి విమర్శించారు. 1996 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్‌కు మనసు రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ బిల్లును యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంటే, విపక్షాలు అనవసరపు రాజకీయ కారణాలతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు.

**మహిళా సాధికారతకు నిదర్శనం**

మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల దేశాభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములుగా మాత్రమే కాకుండా, నిర్ణేతలుగా (ఐవఏఅంఅశీఅ మీఃఎవతీం) మారతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఈ బిల్లు మహిళలకు రాజకీయ న్యాయం చేకూరుస్తుందని పేర్కొన్నారు. పునర్విభజన ప్రక్రియలో ప్రతి రాష్ట్రం గొంతు వినబడుతుందని, పబ్లిక్ హియరింగ్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలను తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ చారిత్రక ఘట్టంలో భాగస్వామ్యం కావడం గర్వంగా ఉందని చెబుతూ ఆమె తన ప్రసంగాన్ని ముగించారు.

## ఏ రాష్ట్రానికీసీట్ల శాతం తగ్గదు!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మహిళా రిజర్వేషన్‌ను ఇంకెంత మాత్రం జాప్యం చేయకూడదని, ఇప్పటికే వారికి చాలా అన్యాయం జరిగిందని చెప్పారు. సాంకేతిక కారణాలు, ఏవో నెపాలు చూపిస్తూ మహిళలను మోసం చేయరాదని విజ్ఞప్తి చేశారు. బిల్లు ఆమోదం పొందితే ఘనత దక్కించుకోవాలని తాను భావించడంలేదని, ఆమోదం పొందకపోతేనే తనకు ప్రయోజనకరమని అన్నారు. మహిళా రిజర్వేషన్‌ను అందరూ ఆమోదిస్తే వార్తా పత్రికల్లో అందరి ఫోటోలు తన ఖర్చుతో వేయిస్తానని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల ఎవరి పట్లా అన్యాయం కానీ వివక్ష కాని జరగదని హామీ ఇచ్చారు. ఉద్దేశం మంచిదైనప్పుడు పదాలతో ఆడుకోకూడదని విపక్షాలకు విజ్ఞప్తి చేశారు. మహిళా కోటాలో ఓబీసీలకు వాటా డిమాండ్‌పై ప్రధాని మోదీ స్పందిస్తూ, తాను కూడా ఓబీసీనేనని, రాజ్యాంగ ప్రకారం అందరికీ న్యాయం చేయాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. లోక్‌సభ సీట్ల పెంపు, మహిళలకు రిజర్వేషన్ గురించి తాము ముందుగానే ఆలోచించామని, అందుకే అందరికీ చోటు కల్పిచేందుకు కొత్త పార్లమెంట్‌ను విశాలంగా నిర్మించామని అన్నారు.

**దక్షిణాది రాష్ట్రాలకే లాభం**

డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు లాభమే తప్ప ఎలాంటి నష్టం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. దక్షిణాదిలో ఉన్న జనాభా కంటే ఎక్కువ సీట్లు లభిస్తాయని, ఎక్కడ అన్యాయం జరుగుతుందో చె ప్పాలని నిలదీశారు. తాము అన్ని రాష్ట్రాలకు దాదాపు 50 శాతం మేరకు సీట్లు పెంచాలని నిర్ణయించినట్లు ఆయన అధికారికంగా వెల్లడించారు. దక్షిణాది రాష్ట్రాలకు ప్రస్తుతం లోక్‌సభలో 129 మంది సభ్యులున్నారని, వారి సంఖ్య 195 సీట్లకు పెరుగుతుందని వివరించారు. లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి(0.21 శాతం) పెరుగుతుందన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ సీట్లు 25 నుంచి తమిళనాడుకు 7.18 శాతం నుంచి 7.23 శాతానికి(0.05 శాతం అదనం) వాటా పెరుగుందని వివరించారు. కర్ణాటకకు 5.15 శాతం నుంచి 5.14 శాతానికి (0.01 శాతం తక్కువ) కేరళకు 3.68 శాతం నుంచి 3.67 శాతానికి(0.01 శాతం తక్కువ) వాటా అత్యంత స్వల్పంగా తగ్గుతుందని హోంమంత్రి చెప్పారు.

## ఏపీలో భగ్గుమన్న సూరీడు..

(మొదటి పేజీ తరువాయి)

భారీగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా మన్యం, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠంగా 43 నుంచి 44.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది. అంతేకాకుండా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఏపీఎస్డీఎంఏ హెచ్చరించింది. మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం ప్రాంతాల్లోని సుమారు 30 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 55 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లవద్దని సూచించింది. వృద్ధులు, చిన్నారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

## పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్ఎమ్‌సీలకు అప్పగించండి : మంత్రి నారా లోకేశ్

(మొదటి పేజీ తరువాయి)


కల్పించాలని అధికారులను మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు.నాణ్యమైన విద్యా బోధనకు ముఖ ఆధారిత హాజరు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి నారా లోకేష్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ, ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్యా సంస్థల వివరాలతో పాటు సిబ్బంది, విద్యార్థుల ముఖ ఆధారిత గుర్తింపు కోసం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై మంత్రి ఆరా తీశారు.

# మత్స్యకారులను మోసం చేసిందే జగన్

## కూటమి పాలనతో వారి కుటుంబ భద్రత,సంక్షేమం.

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు.

కురుపాం , ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : మత్స్యకారులను మోసగించింది జగన్ అని,కూటమి పాలనతో వారి కుటుంబభద్రత,సంక్షేమం అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం జగన్ జువ్వలదిన్నె ఆర్బర్ వద్ద పచ్చి అబద్దాలు చెప్పారని ఆక్షేపించారు.బుధవారం సాయంత్రం అమరావతి నుంచి ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల కోసం చేపట్టిన సంక్షేమం, జగన్ హయాంలో నిర్లక్ష్యం పై ఒక ప్రకటన విడుదల చేశారు.ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి గత ప్రభుత్వ వాటా 128 కోట్లను ఉపయోగించకుండా నిధులను పక్కదారి పట్టించారని,రాష్ట్ర వాటా మత్స్యకారుల కోసం వినియోగించు కోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు.కూటమి పాలన రావడంతో వాటా నిధులు చెల్లించాలని కేంద్రం లేఖ రాసిందన్నారు.నిధులు చెల్లించకపోతే యితర రాయితీలు అమలు చేయలేమంటూ హెచ్చరిందని మంత్రి వెల్లడించారు .నిధులు 128 కోట్లు కేంద్ర ఆదేశాలు మేరకు చెల్లించసన్నారు.వేట నిషేధ సమయంలో చెల్లించే భృతి 10 వేలు నుంచి 20 వేలకు పెంచి లక్షలాది కుటుంబాలకు నేరుగా భరోసా కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు.ఒకే సంవత్సరంలో భారీగా 242 కోట్లకు పైగా చెల్లించడం ప్రభుత్వ నిభద్దతకు నిదర్శం అని పేర్కొన్నారు.మత్సకారులకు ఆర్థిక భారం తగ్గించే డీజిల్ సబ్సిడీ సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు.లీటరు డీజిల్ కి 9 రూపాయల సబ్సిడీ పై వేలాది పడవలకు ప్రయోజనం అందిస్తున్నామని మంత్రి వివరించారు. వేట సమయంలో మత్స్యకారుల ప్రమాద మరణ పరిహారం 10లక్షలు పెంచమని జగన్ చెప్పడాన్ని మంత్రి అచ్చెన్న అక్షేపించారు.ఆయన హయాం 2024-25 లో మరణ పరిహారం 3.15 కోట్లు,2025-26 లో 5.65 కోట్లు పెండింగ్ బకాయిలు చెల్లించి వారి కుటుంబాలకు భరోసా కల్పించామని తెలిపారు.మత్స్యకారుల భద్రత కోసం టాన్స్పాండర్లు అమర్చడం,కృత్రిమ రీఫ్ ల ఏర్పాటు ,చేప పిల్లలు విడుదల,డీప్ సి ఫిషింగ్ పడవలు పంపిణీ వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి,ఫిస్సింగ్ హార్బర్లు,ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం ద్వారా మత్స్య కారుల జీవన ప్రమాణం మెరుగుపరుస్తున్నామన్నారు.మత్స్యకారుల డిమాండ్ మేరకు 2015-16 లో 8 ఫిషింగ్ హార్బర్లు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి సంభందించిన డిపిఆర్ లను డబ్ల్యూ ఎపిసిఓ ద్వారా సిద్ధం చేయించామన్నారు.ఫేజ్ 1 లో జువ్వలదిన్నె,ఉప్పాడ, మచిలీపట్నం,నిజాంపట్నం,హార్బర్లు నిర్మాణం లో ఉన్నాయన్నారు.ఫేజ్ 2 లో బుడగట్లపాలెం,పుడిమరక,కొత్తపట్నం,హార్బర్ల ప్రతిపాదనలు సిద్ధం చేసామన్నారు.జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50-50నిధులతొ ఆమోదించగా నిర్మాణ పూర్తి దశలో ఉందన్నారు.ఉప్పాడ మచిలీపట్నం, నిజాం పట్నం ,ఓడ రేవు హార్బర్లు 2019-20 లో ఆమోదం పొందినా అప్పటి ప్రభుత్వం ఎఫ్ ఐడిఎఫ్ రుణం సక్రమంగా వినియోగించక పోవడం తో పనులు మందగించాయని విమర్శించారు.ఆయా హర్బార్లల నిర్మాణం వేగవంతమయ్యాయని మంత్రి తెలిపారు.కేంద్ర ప్రభుత్వం పిఎంఎంఎస్వై పథకం క్రింద బుడగట్ల పాలెం,పుడిమడక,కొత్త పట్నం హార్బర్ల నిర్మాణం ఆమోదించిందన్నారు.రాష్ట్రం 3 వేల 328.48 కోట్లతో 10హార్బర్లు అభివృద్ధి జరుగుతుందన్నారు.భీమిలి,రాజయ్యపేట,చింతపల్లి,రాయుదరువు, దొండవాక,ఉప్పలంక ప్రాంతాల్లో 126.91 కోట్లతో 6 ఫిస్ ల్యాండింగ్ సెంట్రలుకి ఆమోదం లభించినా గత ప్రభుత్వ నిర్లక్ష్యం తో పనులు ప్రారంభం కాలేదని మంత్రి మండి పడ్డారు.




# ఝహైస్కూల్లో 24న మెగా జాబ్ మేళా ఎమ్మెల్యే గణబాబు




విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : విశాఖ పశ్చిమ నియోజకవర్గం 92 వ వార్డు గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఈనెల 24 వ తేదీ నాడు 50 ప్రముఖ కంపెనీలతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని ఆశక్తి ఉన్న యువతీ యువకులు పాల్గొనాలని ప్రభుత్వ విప్ పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు కోరారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేనుశారం చదువుకున్న యువతీ యువకులకు ఉద్యోగ కల్పనే ద్యేయంగా పనిచేస్తున్నారన్నారు యువత మంచి ఉద్యోగవకాశాలు అందిపుచ్చుకోవలన్నారు గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో 16 వందలకు పైగా మంచి ఉద్యోగవకాశాలు పొందారన్నారు విశాఖ లో పేరొందిన ఐటి కంపెనీలు స్టీల్ ప్లాంట్ ూ× సెంటర్లు,గూగుల్ వంటివి ఉన్నాయిా,వస్తున్నాయన్నారు ప్రతీ మూడు నెలలొకసారి జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు ఇది నిరంతర పక్రియన్నారు ఏప్రెల్ 24 న జరుగుతున్నా జాబ్ మేళా వాల్ పోస్టర్ నువిడుదల చేశారు ఈ కార్యక్రమం లో స్కిల్ డవల్మెంట్ ప్రతినిదులు చాముండేశ్వర్రావు,రమేష్ జోనల్ కమీషనర్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

# గంధం అమావాస్యకు ఏర్పాట్లు పూర్తి



విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో గంధం అమావాస్య వేడుకకు అంత సిద్ధమైంది. ప్రతీ యేటా చైత్ర బహుళ అమావాస్యను గంధం అమావాస్యగా కొలుచుకోవడం ఆనవాతీగా వస్తోంది. చందనోత్సవానికి ముందు వచ్చే అమావాస్య కాబట్టి దీనిని గంధం అమావాస్య అంటారు. ఉత్తరాంధ్ర జిల్లాలలోని గ్రామీణ, సముద్ర తీర ప్రాంత భక్తులు వేలాదిగా తరలివచ్చి సింహాచలేశుని దర్శనం చేసుకోవడం సంప్రదాయం. ప్రధానంగా వీరంతా కొండ దిగువ పుష్కరిణీ వద్దకు వచ్చి వంటలు నిచేసుకుని, పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేస్తారు. కోలలు వెలిగించి వండిన ఆహారాన్ని గంగమ్మతల్లికి, సింహాద్రి అప్పన్నకి నివేదిస్తారు. కుటుంబాల సమేతంగా తరలిరానున్న భక్తుల కోసం దేవస్థానం ఏర్పాట్లు చేసింది. పుష్కరిణీ జట్టు పై నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేసారు. భక్తులు స్నానమాచరించే ప్రదేశాలను శుభ్రం చేశారు. లోతైన ప్రదేశంలోకి భక్తులు వెళ్లకుండా చెరువులో బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ కూడా భక్తులు చెరువు వద్ద కూడా ఉండే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. గురువారం రాత్రి అమామస్య తిథి ఉండడంతో భక్తులు ఇప్పటికీ పుష్కరిణికి చేరుకుని పూజలకు సన్నద్ధమవుతున్నారు. ఈరోజు నుండి దేవాలయంలో మూలవిరాట్ కి గంగధార జలాలతో పవిత్ర కార్యం నిర్వహిస్తారు.ఇలా చేయడం వలన స్వామివారి పై ఉన్న గంధం ఒలుపుకు అనువుగా ఉంటుందని వైదిక పెద్దలు తెలియజేశారు.

# సీఐటీయూ 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి...

### నంద్యాలకు తరలివెళ్లిన కార్మిక సంఘం ప్రతినిధులు

విశాఖపట్నం, విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : ఏప్రిల్ 17 నుండి 19 వరకు నంద్యాలలో జరగనున్న సిఐటియు 17వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్ పిలుపునిచ్చారు. మహాసభలకు విశాఖ నుండి సిఐటియు ప్రతినిధులు గురువారం మధ్యాహ్నం రైల్వే స్టేషన్ గేట్ నెంబర్ మూడు నుండి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు విశాఖ జిల్లా నుండి 60 మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. వెయ్యి మంది సభ్యత్వానికి ఒక ప్రతినిధి చొప్పున ఈ మహాసభలకు బయలుదేరారని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్, బీహెచ్ఈఎల్, పోర్ట్, హెచ్పిసిఎల్, ముఠా,.బిల్డింగు ఆటో తోపుడు బళ్ళు, అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజనం పథకం, ఆర్ పి తదితర రంగాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. రాష్ట్రంలో సంఘటిత సంగటిత రంగ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభల్లో చర్చిస్తామన్నారు. భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. మహాసభల ప్రారంభ రోజున 17న ఉదయం కార్మిక ప్రదర్శన, అనంతరం జరిగే బహిరంగ సభకు సిఐటియు అఖిలభారత ప్రధాన కార్యదర్శి కరీం, పూర్వ అధ్యక్షులు హేమలత, అఖిల భారత కోశాధికారి సాయిబాబా ముఖ్య వక్తలుగా పాల్గొంటారన్నారు. రాష్ట్ర నలుమూలల అన్ని జిల్లాల రంగాల నుండి సుమారు 650 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరవుతున్నారు. కార్మికుల ప్రధాన సమస్యలైన లేబర్ కోడ్స్ రద్దు, కనీస వేతన రూ.26,000 సాధన, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, ఖాళీ పోస్టులు భర్తీ వంటి వాటిపై చర్చించి, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం అమలు కోసం డిస్పాచ్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విశాఖ నుంచి బయలుదేరిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే యం శ్రీనివాస్, ఆర్కేఎస్ వి కుమార్, నాయకులు జగ్గనాయుడు, అయోధ్యరామ్, వెంకట్ రెడ్డి, మణి, జగన్, వెంకట్రావు, వెంకటలక్ష్మి, లక్ష్మి మూర్తి, రాంబాబు, తదితరులు తరలి వెళ్లారు.

# న్యాయ స్థానాల తీర్పులను గౌరవించి కొల్లేరు సరస్సును కాపాడండి

### ..జల బిరాదరి నేషనల్ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ

విశాఖపట్నం, ఏప్రిల్ 16, (ది ఎవిడెన్స్) : రాష్ట్రానికి 'వరం' అని పిలుచుకుంటున్న కొల్లేరు సరస్సును గౌరవ న్యాయ స్థానాల తీర్పులను గౌరవించి కాపాడాలని పర్యావరణ వేత్త, జల బిరాదరి నేషనల్ కన్వీనర్ బొలిశెట్టి సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం నగరంలోని హోటల్ మేఘాలయలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వాల అనైతిక చర్యలతో రాష్ట్రానికి శాపంగా మారిన కొల్లేరు ప్రస్తుత దయనీయ స్థితిలో ఉందని సాక్షాధారాలతో వివరించారు. జీవ సరస్సు కొల్లేరు మన కళ్ల ముందే మరణిస్తోందని, ఇది కేవలం ఒక నీటి కుంట కాదని, ప్రపంచం గుర్తించిన ఒక అపురూపమైన రామ్సర్ సైటని అన్నారు. ఈ రోజున ఈ సరస్సు రాజకీయ స్వార్థానికి, ఆక్రమణలకు బలైపోయి మూగ రోదన రోదిస్తోందన్నారు. 2006లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిగిన 'ఆపరేషన్ కొల్లేరు' ద్వారా సుమారు 43,724 ఎకరాల్లో అక్రమ చెరువులను తొలగించారని గుర్తు చేశారు. ఆ ఫలితం 2009 నాటి మ్యాపుల్లో స్పష్టంగా కనిపించి ఈ జీవ సరస్సుకు మళ్లీ ఊపిరి పోసుకున్నట్లుగా నిలిచిందన్నారు. అయితే ఆ విజయం ఎంతో కాలం నిలవలేదని, ప్రభుత్వ అఫిడవిట్ ప్రకారమే, 2007 నుండి 2023 వరకు ఏకంగా 17,771 ఎకరాలు మళ్లీ ఆక్రమణలకు గురయ్యా యన్నారు. పర్యావరణ పరిరక్షణ గురించి నిత్యం మాట్లాడే రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్న కూటమి ప్రభుత్వంలో కూడా కొల్లేరు విధ్వంసం ఆగకపోవడం అత్యంత దురదృష్టకర మన్నారు. ప్రస్తుతం సేకరించిన గూగుల్ మ్యాప్ ప్రకారం కూటమి ప్రభుత్వ హయాంలో కొల్లేరు విధ్వంసం జోరందు కోవడం పర్యావరణ ప్రేమికులను తీవ్రంగా కలచి వేస్తోందన్నారు. ఇలాగైతే ప్రభుత్వాలు మన భవిష్యత్ తరాలకు ఇచ్చేది విషపూరితమైన నీరు, విషపూరితమైన గాలి, విషపూరితమైన జల సంపద యేనా అని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు వైల్డ్ లైఫ్ శాంక్చురీలో జరుగుతున్న తాజా ఆక్రమణల (2024-2026) నివేదిక, సుప్రీంకోర్టు ఆదేశాల అమలుపై సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీకి అన్ని ఆధారాలతో విజ్ఞాపన పత్రం అందించా మన్నారు. రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ కొత్త ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి, తక్షణమే వాటిని తొలగించాలని, సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో 11 కొత్త ప్రధాన ఆక్రమణ ప్రాంతాలను శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా గుర్తించామన్నారు. ప్రభుత్వం తన అధికారిక అఫిడవిట్లోనే 17,771.18 ఎకరాల భూమి పునరాక్రమణకు గురైందని అంగీకరించిందన్నారు. ఈ నెల 20న జరగ నున్న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ మీటింగ్లో ఈ తాజా ఆక్రమణలను రెడ్ జోన్లుగా గుర్తించి వాటిని తక్షణమే తొలగించేలా రాష్ట్ర ప్రభుత్వానికి కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని పర్యావరణ వేత్తలంతా ముక్త కంఠంతో కోరుతున్నారన్నారు.




# డి లిమిటేషన్ తో పాటు ఎస్సీ ఎస్టీల రాజకీయ రిజర్వేషన్లను పునః సమీక్షించండి..

### దళితుల ప్రయోజనాలను కాపాడని రిజర్వేషన్లు వద్దు..

### విదసం నేత డాక్టర్ బూసి వెంకటరావు




విశాఖపట్నం, న్యూస్ లీడర్, ఏప్రిల్ 16: డి లిమిటేషన్ చట్ట సవరణతో పాటు ఎస్సీ ఎస్టీల రాజకీయ రిజర్వేషన్లను సమీక్షించాలని విదసం (విస్తృత దళిత సంఘాల) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం రామ టాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల ప్రయోజనాలు కాపాడలేని రిజర్వేషన్లు వద్దని, పూనాపేక్ట స్థానంలో కమ్యునల్ అవార్డు అమలును పరిశీలించాలని డిమాండ్ చేశారు. నేటి నుండి మూడు రోజుల పాటు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో లోక్ సభ, అసెంబ్లీ స్థానాల పెంపుకు చట్టాన్ని సవరిస్తున్న నేపద్యంలో ఎస్సీ ఎస్టీ ల రాజకీయ రిజర్వేషన్ విధానంలో మార్పులకు సరైన సమయం అన్నారు. ఇప్పుడు అమలవుతున్న రిజర్వుడు నియోజకవర్గాల విధానం వల్ల దళితులకు ప్రయోజనం లేదన్నారు. ఈ ఫార్ములా మాకొద్దు అని 1932 లోనే అంబేద్కర్ వాదించినప్పటికీ, మహాత్మా గాంధీ ఎరవాడ జైల్లో కమ్యూనల్ అవార్డుకు, ఎస్సీ ఎస్టీలకు వ్యతిరేకంగా చేసిన ఆమరణ దీక్ష కారణంగా పూనాపేక్ట ఒప్పందశీ ద్వారా ప్రస్తుత రాజకీయ రిజర్వేషన్ విధానం ఎస్సీ ఎస్టీలపై బలవంతంగా రుద్దబడిందని వివరించారు. ఈ రిజర్వేషన్ పద్ధతి ప్రతి పదేళ్లకోసారి సమీక్షించి పొడిగించబడిందే తప్ప, దళితుల సామాజిక స్థితిగతుల్లో ఏ మాత్రం మార్పు రాలేదన్నారు. పూనాపెక్ట ఫార్ములా మార్చకుండా ఎంత కాలం పొడిగించినా, రిజర్వుడు నియోజకవర్గాల లక్ష్యం నెరవేరదని వెంకటరావు స్పష్టం చేశారు. తమ ప్రతినిధులుగా చట్టసభలకు వెళ్తున్న 132 ఎంపీలు, 4 వేలకు పైగా ఎమ్మెల్యేలు దళితుల ప్రయోజనాలు కోసం నిలబడలేని రాజకీయ దీనావస్థలో ఉన్నారన్నారు. సబ్ ప్లాన్ నిధులు దుర్వినియోగం అయినా, అసైన్డ్ భూములు లాగేసుకున్నా, అట్రాసిటీ చట్టం నిర్వీర్యం అయినా, మత స్వేచ్ఛకు అడ్డంకులు వచ్చినా, తమ ఆడబిడ్డలను చెరిచినా, చంపుతున్నా నోరు మెదపలేని ఎంపీలు, ఎమ్మెల్యే తమకు ఎందుకన్నారు. దళితుల పక్షాన నిలబడలేని రిజర్వేషన్లు మాకొద్దని వెంకట రావు తెగేసి చెప్పారు. ఈ ప్రత్యేక సమావేశాల్లోనే పూనాపెక్ట స్థానంలో అంబేద్కర్ ప్రతిపాదించిన కమ్యూనల్ అవార్డు ఫార్ములాతో ఆర్టికల్ 330కి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్టికల్ 80కి కూడా సవరణ చేసి రాజ్య సభ సీట్లు పెంచి వాటికీ రిజర్వేషన్లు వర్తించేటట్టు చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గుడివాడ ప్రసాద్, బూల భాస్కర రావు, గోడి వెంకటేశ్వర రావు, గుడివాడ భాస్కర రావు, చక్కా రాంబాబు, పావాడ సన్యాసిని రావు, జి తాత బాబు, గార గోపి, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ సర్జరీ-బొటాక్స్ పుకార్లపై స్పందించిన నటి

ప్రముఖ నటి అవ్ నీత్ కౌర్ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తనపై వస్తున్న ప్లాస్టిక్ సర్జరీ - బొటాక్స్ పుకార్లపై ఎట్టకేలకు మౌనం వీడారు. తన ముఖ కవళికల్లో మార్పులు వచ్చాయంటూ నెటిజన్లు చేస్తున్న కామెంట్లను ఆమె తీవ్రంగా ఖండించారు. తన ముఖ సౌందర్యం , ఫీచర్స్ అన్నీ తన తల్లి నుండి వచ్చిన సహజమైన పోలికలని.. అనవసరమైన కాస్మెటిక్ చికిత్సల జోలికి వెళ్లలేదని స్పష్టం చేశారు. సెలబ్రిటీల బాహ్య రూపంపై తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని ఈ సందర్భంగా అవ్‌నీత్ ఆవేదన వ్యక్తం చేశారు.చిన్నప్పటి నుండే కెమెరా ముందు పెరుగుతున్న తనను చూస్తున్న ప్రేక్షకులకు.. వయసుతో పాటు వచ్చే సహజమైన మార్పుల గురించి అవగాహన ఉండాలని అవ్‌నీత్ పేర్కొన్నారు. కౌమార దశ నుండి యవ్వనంలోకి అడుగుపెట్టే క్రమంలో ముఖంలో వచ్చే మార్పులను సర్జరీగా పొరబడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. దీనికి తోడు సరైన మేకప్ టెక్నిక్స్.. విభిన్నమైన కెమెరా యాంగిల్స్ .. లైటింగ్ వల్ల ముఖం కొన్నిసార్లు భిన్నంగా కనిపిస్తుందే తప్ప..అది ప్లాస్టిక్ సర్జరీ ఫలితం కాదని వివరణ ఇచ్చారు.సోషల్ మీడియాలో వచ్చే నెగెటివ్ కామెంట్స్.. బాడీ షేమింగ్ తన ఆత్మవిశ్వాసాన్ని ఏమాత్రం దెబ్బతీయలేవని అవ్‌నీత్ ధీమా వ్యక్తం చేశారు. ట్రోలర్స్ చేసే వ్యాఖ్యలను పట్టించుకోకుండా తన వృత్తిపరమైన బాధ్యతలపైనే దృష్టి సారిస్తానని తెలిపారు. చర్మ సౌందర్యం కోసం తాను ఎప్పుడూ సహజమైన పద్ధతులనే అనుసరిస్తానని.. ఆరోగ్యకరమైన జీవనశైలి .. ఫిట్‌నెస్ ద్వారానే తాను అందంగా కనిపిస్తున్నానని ఈ యువ నటి స్పష్టం చేశారు. తన ముక్కు ముఖమార్పిడి చికిత్సలు చేయించుకోలేదని తెలిపారు. బాహ్య సౌందర్యం కంటే వ్యక్తిత్వం- ప్రతిభ ముఖ్యమని తన అభిమానులకు సందేశం ఇచ్చారు.అవ్‌నీత్ కౌర్ సినీ కెరీర్ విషయానికి వస్తే... ఒక డ్యాన్సర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించి అనతి కాలంలోనే టాప్ నటిగా ఎదిగారు. --డాన్స్ ఇండియా డాన్స్ లిటిల్ మాస్టర్స్-- ద్వారా గుర్తింపు పొందిన ఈ బ్యూటీ ఆ తర్వాత -చంద్ర నందిని-, -అల్లాదీన్ - నామ్ తో సునా హోగా- వంటి సీరియల్స్ తో బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు. రాణి ముఖర్జీ నటించిన -మర్దాని- చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన అవ్‌నీత్ అటుపై నవాజుద్దీన్ సిద్ధిఖీ సరసన-టికూ వెడ్స్ షేరు- చిత్రంలో కథానాయికగా నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు.ప్రస్తుతం అవ్నీత్ కౌర్ పలు చిత్రాల్లో నటిస్తున్నారు. కొన్ని వెబ్ సిరీస్‌ల చర్చలు కూడా తుది దశలో ఉన్నాయి. కేవలం నటనకే పరిమితం కాకుండా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా కూడా లక్షలాది మంది ఫాలోవర్లను సంపాదించుకున్న అవ్ నీత్ తన తదుపరి చిత్రాలతో వెండితెరపై తన గ్రాఫ్ ని పెంచుకోనున్నారు.



# రానా దగ్గుపాటి : టాలీవుడ్ హీరోలు టీచర్లు అయితే ఏ సబ్జెక్ట్ చెబుతారో తెలుసా?

టాలీవుడ్ భల్లాలదేవ రానా దగ్గుబాటి అంటే కేవలం నటన మాత్రమే కాదు, తనదైన చమత్కారంతోనూ అందరినీ ఆకట్టుకుంటారు. గతం లో ఒక మూవీ ఫంక్షన్‌లో యాంకర్ సుమ అడిగిన ప్రశ్నలకు రానా అదిరిపోయే సమాధానాలు ఇచ్చారు. మన టాలీవుడ్ స్టార్ హీరోలు ఒకవేళ టీచర్లు అయితే ఏ సబ్జెక్టులు బోధిస్తారనే అంశంపై రానా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆ సరదా ముచ్చట్లు ఏంటో ఒకసారి చూద్దాం..



రాజమౌళి - ఆల్ ఇన్ వన్ టీచర్:దర్శకధీరుడు రాజమౌళి గురించి రానా చెబుతూ.. ఆయన అన్ని సబ్జెక్టులు నేర్పించగల సమర్థుడని పేర్కొన్నారు. స్కూల్ అయిపోయాక సాయంత్రం వేళ మనం వెళ్లే 'స్పెషల్ ట్యూషన్ టీచర్' లాగా రాజమౌళి గారు ఉంటారని చమత్కరించారు. అంటే ఏ సందేహం వచ్చినా, ఏ విషయంలోనైనా క్లారిటీ ఇవ్వడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా అని రానా ఉద్దేశ్యం. సినిమా అనే స్కూల్‌లో ఆయన ఒక హెడ్ మాస్టర్ లాంటి వారని రానా మాటలను బట్టి అర్థమవుతోంది.

చరణ్, ప్రభాస్‌ల స్పెషల్ క్లాసులు:ఇక రామ్ చరణ్ గురించి మాట్లాడుతూ.. చరణ్‌కు గుర్రపు స్వారీ అంటే ఎంతో ఇష్టమని, అందుకే ఆయన అందరికీ 'హార్స్ రైడింగ్' నేర్పిస్తే బాగుంటుందని రానా చెప్పారు. అలాగే గ్లోబల్ స్టార్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన బిహేవియరల్ అండ్ కల్చరల్ క్లాసులు తీసుకోవాలని సూచించారు. అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమిస్తూ, హ్యాపీగా ఎలా ఉండాలో ప్రభాస్ కంటే బాగా ఎవరూ నేర్పించలేరని రానా కొనియాడారు. డార్లింగ్ వ్యక్తిత్వం అలాంటిది మరి.

అనుష్క మంచితనం.. ఎన్టీఆర్ తెలుగు: అనుష్క శెట్టి గురించి రానా చెబుతూ ఒక ఆసక్తికరమైన ఉదాహరణ ఇచ్చారు. జపాన్‌లోని స్కూల్స్‌లో పిల్లలకు మనుషులతో ఎలా మాట్లాడాలి, ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకోవాలి వంటి లైఫ్ స్కిల్స్ నేర్పిస్తారని, అలాంటి 'మంచితనం' నేర్పించడానికి అనుష్క సరైన వ్యక్తి అని చెప్పారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే, ఆయన 100% పక్కా 'తెలుగు టీచర్' అని రానా తేల్చేశారు. తారక్ మాట్లాడే స్వచ్ఛమైన తెలుగును వింటే ఎవరైనా సరే ఆయనకు ఈ సబ్జెక్ట్ ఇచ్చేయాల్సిందే.ఒక చిన్న రాపిడ్ ఫైర్ రౌండ్‌లో రానా చెప్పిన ఈ విషయాలు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి హీరో వ్యక్తిత్వానికి, వారికున్న ఇష్టాలకు అనుగుణంగా రానా సబ్జెక్టులను ఎంచుకున్న తీరు చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. "రానా గారు పక్కాగా గెస్ చేశారు" అంటూ సోషల్ మీడియాలో కామెంట్స్ వర్షం కురుస్తోంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, తన తోటి నటీనటుల గురించి రానాకు ఉన్న అవగాహన చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ వీడియో మీరు కూడా చూశారా? ముగింపుగా చెప్పాలంటే.. మన స్టార్ హీరోలు ఒకవేళ నిజంగా టీచర్లు అయితే ఆ స్కూల్స్ అన్నీ హౌస్ ఫుల్ అవ్వడం ఖాయం!

# ఆర్‌సీబీ ఆడుతూ పాడుతూ...

బెంగళూరు: సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) 'హ్యాట్రిక్' విజయాన్ని అందుకుంది. బుధవారం జరిగిన ఏకపక్ష పోరులో గెలిచి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ మ్యాచ్‌లో ఆర్‌సీబీ 5 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 20 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (32 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ముకుల్ చౌదరి (28 బంతుల్లో 39; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆయుశ్ బదోని (24 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆర్‌సీబీ బౌలర్లలో రసిఖ్ సలామ్ (4/24) లక్నోను పడగొట్టగా... భువనేశ్వర్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం బెంగళూరు 15.1 ఓవర్లలో 5 వికెట్లకు 149 పరుగులు చేసి విజయాన్నందుకుంది. విరాట్ కోహ్లి (34 బంతుల్లో 49; 6 ఫోర్లు, 1 సిక్స్) టాప్‌స్కోరర్‌గా నిలవగా...రజత్ పాటీదార్ (13 బంతుల్లో 27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జితేశ్ శర్మ (9 బంతుల్లో 23; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడటంతో మరో 29 బంతులు ఉండగానే ఆర్‌సీబీ గెలుపు ఖాయమైంది. మూడు కీలక వికెట్లు తీసిన రసిఖ్ సలామ్‌కు కాకుండా ఒక వికెట్ పడగొట్టిన హాజల్‌వుడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు ఇవ్వడం గమనార్హం.

సమష్టి వైఫల్యం...

చిన్నస్వామి స్టేడియంలో లక్నో ఇన్నింగ్స్ పేలవంగా ప్రారంభమైంది. మొత్తం పవర్‌ప్లేలో ఆ జట్టు 1 ఫోర్, 2 సిక్స్‌లతో 35 పరుగులే చేయగలిగింది. మార్క్‌రమ్ (12) విఫలం కాగా, మార్ష్ మాత్రం ఫర్వాలేదనిపించాడు. పూరన్ (1) తన వైఫల్యాన్ని కొనసాగించగా, కృనాల్ తన వరుస ఓవర్లలో మార్ష్ , సమద్ (0)లను వెనక్కి పంపించాడు. ఇలాంటి స్థితిలో బదోని కొన్ని చక్కటి షాట్లతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. మరోవైపు నుంచి ముకుల్ కూడా అతనికి అండగా నిలిచాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా జార్జ్ లిండే (7)ను బరిలోకి దించినా లాభం లేకపోయింది. ఆర్‌సీబీ పదునైన బౌలింగ్ ముందు మిగతా బ్యాటర్లూ తేలిపోయారు. ఆఖరి 4 ఓవర్లలో లక్నో జట్టు 5 వికెట్లు చేజార్చుకొని 29 పరుగులే చేసింది.

కోహ్లి తొలిసారి...

ఛేదనలో సాల్ట్ (7) తొందరగానే అవుటైనా... కోహ్లి జోరుగా మొదలు



పెట్టాడు. గత మ్యాచ్‌లో మడమ గాయంతో ఫీల్డింగ్ చేయని కోహ్లి ఈ మ్యాచ్‌లో కూడా నేరుగా బ్యాటింగ్‌కే వచ్చాడు. ఐపీఎల్‌లో అతను మొదటిసారి 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దిగాడు. ప్రిన్స్ వేసిన నాలుగో ఓవర్లో అతను 4 ఫోర్లు బాదాడు. కోహ్లి తాను ఆడిన తొలి 14 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్‌తో 34 పరుగులు సాధించడం విశేషం! మరో ఎండ్‌లో పడిక్కల్ (10) విఫలమైనా... పాటీదార్, జితేశ్ దూకుడుతో ఆర్‌సీబీ వేగంగా లక్ష్యం దిశగా దూసుకుపోయింది. షమీ ఓవర్లో పాటీదార్ రెండు వరుస సిక్స్‌లు కొట్టగా... రాఠీ ఓవర్లో జితేశ్ వరుసగా 6, 4, 6, 4 బాదాడు. వీరిద్దరు ఒకే ఓవర్లో అవుటైనా...మిగిలిన 25 పరుగులను బెంగళూరు తర్వాతి 15 బంతుల్లో సాధించి మ్యాచ్ ముగించింది.

స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మిచెల్ మార్ష్ (బి) కృనాల్ పాండ్యా 40; మార్క్‌రమ్ (సి) పడిక్కల్ (బి) సలామ్ 12; పంత్ (సి) సాల్ట్ (బి) భువనేశ్వర్ 1; నికోలస్ పూరన్ (బి) హాజల్‌వుడ్ 1; ఆయుశ్ బదోని (సి) జితేశ్ (బి) సలామ్ 38; సమద్ (సి) పాటీదార్ (బి) కృనాల్ పాండ్యా 0; ముకుల్ (బి) సలామ్ 39; లిండే (సి) డేవిడ్ (బి) భువనేశ్వర్ 7; షమీ (బి) భువనేశ్వర్ 0; అవేశ్ (బి) సలామ్ 1; దిగ్వేశ్ రాఠీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో ఆలౌట్) 146. వికెట్ల పతనం: 1--32, 2--35, 3--71, 4--83, 5--118, 6--124, 7--137, 8--137, 9--145, 10--146.

## బిగ్ బడ్జెట్ సినిమాలపై మృణాల్ క్లారిటీ!



గ్లామర్ కంటే పర్ఫార్మెన్స్‌కే నా ఓటు అంటున్న మృణాల్ ఠాకూర్, తాజాగా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతున్నాయి. తన కెరీర్ గ్రాఫ్‌ను మార్చేసిన సీత, యష్ణ వంటి పాత్రల తర్వాత.. ఆ స్థాయి లేని సినిమాలకు గుడ్ బై చెబుతున్నానని ఆమె గట్టిగా చెప్పారు. తాజాగా 'డెకాయిట్' మూవీతో ఆమె ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సెలెక్టివ్ జర్నీపై స్పెషల్ ఫోకస్ పెట్టారు ఆ వివరాలు చూద్దాం..

బెంచ్‌మార్క్ పాత్రల కోసం వెయిటింగ్:మృణాల్ ఠాకూర్ తన కెరీర్‌లో 'సీతా మహాలక్ష్మి' (సీతారామం), 'యష్ణ' (హాయ్ నాన్న) వంటి పాత్రలను ఒక బెంచ్‌మార్క్‌గా భావిస్తున్నారు. ఆ స్థాయి నటనకు అవకాశం ఉన్న పాత్రలు దొరకడమే కష్టంగా మారిందని, అందుకే భారీ రెమ్యూనరేషన్ లేదా పెద్ద స్టార్స్ ఉన్నా సరే, తన పాత్రకు ప్రాధాన్యత లేకపోతే నిర్మొహమాటంగా 'నో' చెబుతున్నట్లు ఆమె వెల్లడించారు. కథలో లోతు లేని సాధారణ కమర్షియల్ రోల్స్ చేయడం కంటే, కాస్త ఆలస్యమైనా మంచి స్క్రిప్ట్ కోసమే ఎదురుచూస్తానని మృణాల్ స్పష్టం చేయడం విశేషం.

డెకాయిట్‌తో అదిరిపోయే రీ-ఎంట్రీ:విమర్శలు ఎలా ఉన్నా, తాజాగా విడుదలైన 'డెకాయిట్' మూవీతో మృణాల్ మళ్ళీ ఫామ్ లోకి వచ్చారు. ఏప్రిల్ 10, 2026న విడుదలైన ఈ యాక్షన్ డ్రామాలో అడివి శేష్‌తో కలిసి ఆమె పోటీపడి నటించారు. ఇక ముఖ్యంగా ఇంటర్వెల్ సీక్వెన్స్‌లో వచ్చే ట్విస్ట్ మరియు క్లైమాక్స్‌లో ఆమె పర్ఫార్మెన్స్ చూసి విమర్శకులు సైతం ఫిదా అయ్యారు. కొన్ని సీన్లలో అయితే హీరో శేష్‌ను కూడా మించిపోయేలా మృణాల్ తన నటనతో మాయ చేసిందని ఆడియన్స్ ప్రశంసిస్తున్నారు.

పెద్ద ప్యాకేజీ ఆఫర్ కు నో :సీతారామం, హాయ్ నాన్న వంటి క్లాసిక్ హిట్లలో మృణాల్ చేసిన పాత్రలు ప్రేక్షకులలో ఒక బలమైన ముద్ర వేశాయి. అందుకే ఇప్పుడు తన దగ్గరకు వచ్చే ప్రాజెక్టుల విషయంలో ఆమె చాలా కఠినంగా వ్యవహరిస్తున్నారు. కేవలం భారీ బడ్జెట్ ఉంది కదా అనో, లేదా పెద్ద హీరో సినిమా అనో కళ్ళు మూసుకుని సంతకం చేయకుండా.. కథలో లోతు, తన పాత్రకు ఉన్న ప్రాధాన్యతను మాత్రమే చూస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఒక నటిగా తన స్థాయిని పెంచుకోవడమే కాకుండా, ప్రేక్షకులకు ఎప్పుడూ నాణ్యమైన కంటెంట్‌నే అందించాలనే ఉద్దేశంతోనే, ఎంత పెద్ద ప్యాకేజీ ఆఫర్ చేసినా పాత్రలో దమ్ము లేకపోతే నిర్మొహమాటంగా తిరస్కరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.మొత్తానికి మృణాల్ ఠాకూర్ ఇప్పుడు తన కెరీర్ లో మంచి హిట్ అందుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ఆస్కారమున్న 'డకాయిట్' వంటి కథలను ఎంచుకోవడం ఆమె పరిణతిని చూపిస్తోంది. చిన్నపాటి విమర్శలు ఉన్నప్పటికీ, తెలుగు ప్రేక్షకులు మాత్రం ఆమెను 'సీత' లాగానే ప్రేమిస్తున్నారు. మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో మృణాల్ తన బెంచ్‌మార్క్‌ను ఇంకా పెంచుకోవాలని కోరుకుందాం.

# రిటైర్డ్ హర్ట్, రిటైర్డ్ ఔట్ మధ్య తేడా ఇదే..!



క్రికెట్‌లో రిటైర్డ్ హర్ట్, రిటైర్డ్ ఔట్ అన్న పదాలు తరుచూ వినిపిస్తుంటాయి. ఈ రెండు పదాలు ఒకేలా అనిపించినా వాటి నియమాలు, ప్రభావం తేడాగా ఉంటాయి. రిటైర్డ్ హర్ట్ అంటే బరిలోకి దిగిన ఆటగాడు గాయపడినప్పుడు లేదా అనారోగ్యం బారిన పడినప్పుడు క్రీజ్ వదిలి వెళ్తాడు. రిటైర్డ్ ఔట్ విషయానికొస్తే.. వ్యూహాత్మక కారణాల వల్ల బరిలో ఉన్న ఆటగాడు స్వచ్ఛందంగా క్రీజ్ వదిలి వెళ్తాడు. టీ20ల్లో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. ఏవరైనా ఆటగాడు వేగంగా పరుగులు చేయలేకపోతుంటే సంబంధిత జట్లు అతన్ని రిటైర్డ్ ఔట్‌గా క్రీజ్ వదిలి రమ్మని ఆదేశిస్తాయి. ఈ విధానం గతంలో ఎక్కువగా కనిపించకపోయినా, ఇటీవల బాగా ఎక్కువైంది.ఒక్కసారి ఆటగాడు రిటైర్డ్ ఔట్‌గా క్రీజ్ వదిలితే తిరిగి బ్యాటింగ్ చేయడానికి వీలుండదు. అదే రిటైర్డ్ హర్ట్ అయితే మాత్రం వికెట్ పడినప్పుడు లేదా ఇన్నింగ్స్ చివర్లో తిరిగి బ్యాటింగ్‌కు రావచ్చు. రిటైర్డ్ హర్ట్‌గా క్రీజ్ వదిలితే నాటౌట్‌గా పరిగణిస్తారు. దీని వల్ల ఆటగాడి బ్యాటింగ్ సగటుపై నెగిటివ్ ప్రభావం ఉండదు. అదే రిటైర్డ్ ఔట్‌గా క్రీజ్ వదిలితే సదరు ఆటగాడు ఔట్‌గా పరిగణించబడతాడు. దీని వల్ల అతని బ్యాటింగ్ సగటుపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ఐసీసీ నియమాల ప్రకారం ఆటగాడు ఎప్పుడైనా రిటైర్ కావచ్చు. కానీ గాయం లేదా అనారోగ్యం కాకుండా ఇతర కారణాల వల్ల రిటైర్ అయితే, ప్రత్యర్థి కెప్టెన్ అనుమతి లేకుండా తిరిగి రావడం సాధ్యం కాదు. తాజాగా ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్ తొలుత రిటైర్డ్ హర్ట్‌గా క్రీజ్ వదిలి తిరిగి బ్యాటింగ్ చేశాడు. అయినా దురదృష్టవశాత్తు అతని వెంటనే ఔటయ్యాడు. పంత్ ఎపిసోడ్ నేపథ్యంలోనే ఈ రిటైర్డ్ హర్ట్-రిటైర్డ్ ఔట్ ప్రస్తావన వచ్చింది. ఈ సీజన్‌లో రిటైర్డ్ హర్ట్ అయిన రెండో ఆటగాడు పంత్. కొద్ది రోజుల కిందట ఆర్సీబీతోనే జరిగిన మ్యాచ్‌లో రోహిత్ శర్మ కూడా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అయితే అతను పంత్‌లా తిరిగి బ్యాటింగ్‌కు రాలేదు.

Published By : G. Srinivasa Rao. Printed by Harsha Vardhana. J at The Evidence Press, 4-72-4, Second Floor, Shalom House, Beach Road, Lawsons Bay Colony, Visakhapatnam - 530017,A.P, INDIA. T/AP/2025/1017/2082/1372. Contact : +91 9966850202, +91 9885485277.
epaper.theevidencetelugu.in, theevidencedhinapathrika@gmail.com